క్లుప్తంగా

మూడు కిలోల పంచతల వెండి నాగపడగ అందజేత



దోమకొండ: మండల కేంద్రంలోని రేణుకామాత ఎల్లమ్మ ఆలయంలో మంగళవారం గౌడ సంఘం ఆధ్వర్యంలో అమ్మవారికి మూడు కిలోల పంచతల వెండి నాగదేవత పడగ విగ్రహాన్ని అందజేశారు. నాగపడగకు ఆలయ అర్చకులు ప్రత్యేక పూజలు నిర్వహించి అమ్మవారికి తొడిగారు. కార్యక్రమంలో జెడ్పీటీసీ తీగల తిర్మల్‌గౌడ్, ఆలయ కమిటీ అధ్యక్షుడు నాగభూషణం గౌడ్, సదరు సంఘం అధ్యక్షుడు రాజనర్సాగౌడ్, గౌడ సంఘం ప్రతినిధులు సుదర్శన్ గౌడ్, సిద్దాగౌడ్, ప్రసాద్‌గౌడ్, రవిగౌడ్, కర్రొల్ల శ్యాంగౌడ్, వెంకట్‌గౌడ్, యాదగిరి, నర్సాగౌడ్, హరికిషన్‌గౌడ్ పాల్గొన్నారు.

గాయత్రిలో చెరుకు క్రషింగ్

సదాశివనగర్(ఎల్లారెడ్డి): మండలంలోని అడ్లూర్‌ఎల్లారెడ్డి గాయత్రి షుగర్స్ ఫ్యాక్టరీలో చెరుకు క్రషింగ్ ముమ్మరంగా కొనసాగుతుంది. సోమవారం నాటికి లక్షా 22 వేల 683 టన్నుల చెరుకు క్రషింగ్ జరిగినట్లు ఫ్యాక్టరీ వైస్ ప్రెసిడెంట్ వేణుగోపాల్‌రావు తెలిపారు. పర్మిట్ల ఆధారంగా చెరుకును గానుగకు తరలిస్తున్నట్లు పేర్కొన్నారు.

ఉచిత కంటి వైద్య శిబిరం

సదాశివనగర్(ఎల్లారెడ్డి): మండల కేంద్రంలోని వీడీసీ భవనంలో లయన్స్ క్లబ్ ఆధ్వర్యంలో ఉచిత కంటి వైద్య శిబిరం నిర్వహించారు. ఈ సందర్భంగా 56 మందికి వైద్య పరీక్షలు చేశారు. కార్యక్రమంలో క్లబ్ ప్రతినిధులు కొప్పుల నర్సారెడ్డి, సుతారి కృష్ణమూర్తి, మహిపాల్ రెడ్డి, చిట్టెపు రాములు, తదితరులు పాల్గొన్నారు.

గుండెపోటుతో మాజీ ఎంపీటీసీ మృతి



పెద్దకొడప్‌గల్(జుక్కల్): మండలంలోని లింగంపల్లి గ్రామానికి చెందిన కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకుడు, మాజీ ఎంపీటీసీ నారాయణ్ పాటిల్ చొప్డే సోమవారం రాత్రి గుండెపోటుతో మరణించారు. ఆయన మృతితో గ్రామంలో విషాద ఛాయలు నెలకొన్నాయి.

సద్గురు బండాయప్ప పుణ్యతిథి

బిచ్కుంద(జుక్కల్): మండల కేంద్రంలోని సద్గురు బస్వలింగప్ప స్వామి మఠ సంస్థానం ఆధ్వర్యంలో మంగళవారం శ్రీ సద్గురు బండాయప్ప స్వామి పుణ్యతిథిని ఘనంగా నిర్వహించారు. పీఠాధిపతి శ్రీ సోమాయప్ప స్వామి ఆధ్వర్యంలో ఘనంగా పుణ్యతిథి కార్యక్రమం చేపట్టారు. బండాయప్ప స్వామి సమాధికి రుద్రాభిషేకం, లక్షబిల్వార్చన, మంగళహారతి ఇచ్చి ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం భక్తులకు తీర్థ ప్రసాదం అందించారు. పలువురు నేతలు పాల్గొని మొక్కులు తీర్చుకున్నారు.

దుప్పట్ల పంపిణీ



బాన్సువాడ: క్రిస్మస్ పండుగ పురస్కరించుకుని మంగళవారం బాన్సువాడలో మాదిగ సంక్షేమ సమితి ఆధ్వర్యంలో పేదలకు దుప్పట్లు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా మాదిగ సంక్షేమ సమితి రాష్ట్ర అధ్యక్షులు దప్పు మేరీ కుమారి మాట్లాడుతూ.. క్రిస్మస్ పండగకు తన వంతు పేదలకు సహాయం చేయాలనే సంకల్పంతో ఫుట్‌పాత్‌లపై జీవనం సాగిస్తున్న పేదలకు దుప్పట్లు పంపిణీ చేశామని అన్నారు. సమితి జిల్లా అధ్యక్షులు మైత్రి సాయిలు, దివిజ, రజినీకాంత్‌రెడ్డి తదితరులు ఉన్నారు.

ఏబీవీపీ ఎస్‌డీఎఫ్ జిల్లా కన్వీనర్‌గా శ్రీకాంత్



బాన్సువాడ : కామారెడ్డి జిల్లా ఏబీవీపీ ఎస్‌డీఎఫ్ కన్వీనర్‌గా శ్రీకాంత్‌ను నియమించారు. రాష్ట్ర సంఘటన మంత్రి కర్ణకర్ చేతుల మీదుగా నియమాక పత్రాన్ని అందజేశారు. ఈ సందర్భంగా శ్రీకాంత్ మాట్లాడుతూ.. విద్యారంగ సమస్యలపై నిరంతరం పోరాటం చేస్తామని అన్నారు. ప్రభుత్వ పాఠశాలల్లో నెలకొన్న సమస్యలను అధికారుల దృష్టికి తీసుకెళ్తానని అన్నారు.

కాంగ్రెస్ నుంచి బహిష్కరణ

కామారెడ్డి టౌన్: రాజంపేట మండలానికి చెందిన కాంగ్రెస్ నాయకులు బాలకిషన్, గంగాధర్‌గౌడ్‌లను పార్టీ నుంచి బహిష్కరించినట్లు డీసీసీ అధ్యక్షుడు కైలాస్ శ్రీనివాస్‌రావు మంగళవారం పేర్కొన్నారు. ఇటీవల జరిగిన అసెంబ్లీ ఎన్నికల్లో పార్టీ వ్యతిరేక కార్యకలాపాలకు పాల్పడినందుకు పీసీసీ ఆదేశాల మేరకు వారిపై వేటు వేసినట్లు తెలిపారు.

శిథిలావస్థలో బస్ షెల్టర్లు

- ఇబ్బందులు పడుతున్న ప్రయాణికులు
- రోడ్లపై నిలబడుతున్న వైనం



సీతారాంపల్లి గ్రామ బస్‌షెల్టర్

దోమకొండ: శిథిలావస్థలోని బస్‌షెల్టర్‌లతో గ్రామీణ ప్రాంత ప్రజలు తీవ్ర అవస్థలు పడుతున్నారు. దీనికి తోడు అసంపూర్తి నిర్మాణాలు సైతం ప్రయాణికులను వేధిస్తున్నాయి. బస్ షెల్టర్లు సరిగా లేక ప్రయాణికులు చలి, ఎండలో రోడ్లపై నిల్చునే పరిస్థితి నెలకొంది. ఉమ్మడి దోమకొండ మండలంలోని సీతారాంపల్లి, గొట్టిముక్కుల, ముత్యంపేట, అంచనూరు, లింగుపల్లి గ్రామాల్లో బస్‌షెల్టర్‌లు అసంపూర్తిగా ఉన్నాయి. వీటి వల్ల ప్రయాణికులకు ఎలాంటి ఉపయోగం లేకుండా పోయింది. అదే విధంగా జనగామ, ఉప్పర్‌పల్లి, మల్కాపూర్, యాడారం, తుజాల్‌పూర్, ఇస్సానగర్ గ్రామాల్లో సైతం నిరుపయోగంగా ఉన్నాయి. నిత్యం ఆర్టీసీ బస్సులు, ఇతర వాహనాల కోసం ప్రజలు రోడ్లపైనే నిల్చునే పరిస్థితి నెలకొంది. ఊర్ల సమీపంలో చెట్ల నీడను ఆశ్రయిస్తున్నారు. చాలా గ్రామాలకు ఊరి నుంచి బస్సు స్టేజీలు చాలా దూరంలో ఉన్నాయి. అక్కడ ఎలాంటి నిర్మాణాలు లేక వాహనాల రాక కోసం తల దాచుకోవడానికి తీవ్ర ఇబ్బందులు పడాల్సి వస్తుంది.

అవస్థలు పడుతున్న వృద్ధులు, విద్యార్థులు

గ్రామీణ ప్రాంతాల్లో చాలా చోట్ల అనువుగాని చోట బస్‌షెల్టర్‌లు నిర్మించారు. దీంతో ఇవి వినియోగంలో లేకుండా వృథాగా ఉంటున్నాయి. బస్‌షెల్టర్‌లు లేక నిరుపయోగంగా ఉన్నచోట వృద్ధులు, పాఠశాలల పిల్లలు చాలా ఇబ్బందులు పడుతున్నారు. బస్‌స్టేజీలు ఉన్న చోట ప్రయాణ ప్రాంగణాలు నిర్మించాలని, నిరుపయోగంగా ఉన్నచోట వినియోగంలోకి తీసుకురావాలని ప్రజలు కోరుతున్నారు.

నిరుపయోగంగా ఉంది



మాది దోమకొండ మండలం ముత్యంపేట గ్రామం. గ్రామంలో బస్టాండ్ ఉన్నా నిరుపయోగంగా ఉంది. రాత్రి మందుబాబులకు అడ్డాగా మారింది. ప్రయాణికులు రోడ్డుపైనే నిల్చుని ఉంటున్నారు. ఆర్టీసీ అధికారులు నిరుపయోగంగా ఉన్న బస్టాండ్‌కు మరమ్మతులు చేసి వినియోగంలోకి తీసుకురావాలి.

– శ్రీనివాస్, ముత్యంపేట, దోమకొండ మండలం

కప్పు కూలిపోయింది



గ్రామంలోని బస్‌షెల్టర్ పైన కప్పు పూర్తిగా కూలిపోయింది. ప్రయాణికులు వాహనాల కోసం రోడ్లపైనే నిల్చుంటున్నారు. ఉదయం, సాయంత్రం పాఠశాలల పిల్లలు సైతం రోడ్లపైనే నిల్చుంటున్నారు. ఆర్టీసీ అధికారులు స్పందించి బస్‌షెల్టర్‌కు మరమ్మతులు చేసి దానిని వినియోగంలోకి తీసుకురావాలి.

– జాలిగాం నాంపల్లి, సర్పంచ్, సీతారాంపల్లి

నీటి శుద్ధి కేంద్రాన్ని సద్వినియోగం చేసుకోవాలి

- శాస్త్రవేత్త పైడి ఎల్లారెడ్డి



దాతను అభినందిస్తున్న గ్రామ పెద్దలు

తాడ్వాయి(ఎల్లారెడ్డి): తాడ్వాయిలో ఏర్పాటు చేసిన నీటి శుద్ధి కేంద్రాన్ని గ్రామ ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని దేవాయిపల్లి గ్రామవాసి, శాస్త్రవేత్త పైడి ఎల్లారెడ్డి అన్నారు. తాడ్వాయి మండల కేంద్రంలో గ్రామాభివృద్ధి కమిటీ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన నీటి శుద్ధి కేంద్రాన్ని మంగళవారం ఆయన ప్రారంభించారు. శుద్ధి చేసిన నీటిని తాగడం వల్ల ప్రజలు ఆరోగ్యంగా ఉంటారని, కలుషితమైన నీళ్ల తాగడం వల్ల రోగాలు వచ్చే అవకాశముందన్నారు. తాడ్వాయిలో ఉన్న ప్రజలకు నీటి శుద్ధి కేంద్రం ద్వారా తాగు నీళ్లను అందించాలే ఉద్దేశంతో మిషన్‌లను అందించినట్లు తెలిపారు. మిషన్‌లను విరాళంగా ఇచ్చిన పైడి ఎల్లారెడ్డికి గ్రామస్తులు కృతజ్ఞతలు తెలిపారు. సర్పంచ్ సంజీవులు, వైస్ ఎంపీపీ నర్సిములు, వీడీసీ చైర్మన్ మేకల రాజు, గ్రామపెద్దలు మహేందర్‌రెడ్డి, ఎస్సై ఆంజనేయులు పాల్గొన్నారు.

మున్నూరుకాపు సంఘం కార్యవర్గం ఎన్నిక



కొమిరెడ్డి అంజన్న

కామారెడ్డి రూరల్: కామారెడ్డి మున్సిపల్ పరిధిలోని లింగాపూర్ మున్నూరుకాపు సంఘం(మీదివాడ) నూతన కార్యవర్గాన్ని మంగళవారం ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. గౌరవ అధ్యక్షుడిగా దుబాషి పెద్ద నర్సింలు, అధ్యక్షుడిగా కొమిరెడ్డి అంజన్న, ఉపాధ్యక్షుడిగా బొలిశెట్టి నర్సింలు, కార్యదర్శిగా తేలు చిన్న ఆంజనేయులు(చిన్న), కోశాధికారిగా పోసానిపేట వెంకటి, ఉప కార్యదర్శిగా తోట రవీందర్, సమావేశ అధికారిగా ముదాం పెద్ద లింగం, స్పీకర్‌గా ముదాం నారాయణ, సలహాదారులుగా తేలు నారాయణ, యాదగిరి ఎన్నికయ్యారు.

ఘనంగా సీపీఐ ఆవిర్భావ దినోత్సవం



జెండాను ఎగురవేస్తున్న సీపీఐ నాయకులు

కామారెడ్డిటౌన్/బాన్సువాడ: సీపీఐ ఆవిర్భావ దినోత్సవాన్ని మంగళవారం జిల్లాకేంద్రంలో, బాన్సువాడలో ఘనంగా నిర్వహించారు. స్థానిక సీపీఐ కార్యాలయాల్లో పార్టీ జెండాలను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా పార్టీ నేతలు దుబాస్ రాములు, దశరథ్‌లు మాట్లాడుతూ.. సీపీఐ 1925, డిసెంబర్ 26న ఉత్తరప్రదేశ్‌లోని కాన్పూర్‌లో ఆవిర్భవించిందని, స్వాతంత్ర్యం కోసం కార్మికులు, కర్షకులు అనేక ఉద్యమాలు చేశారని గుర్తు చేశారు. తెలంగాణలో నియంతృత్వ పరిపాలనకు ప్రజలు బుద్ధి చెప్పారని అన్నారు. బాన్సువాడ నేతలు విఠల్, రాములు, కామారెడ్డి నేతలు బాల్‌రాజ్, నర్సింలు, మల్లేశ్, ఈశ్వర్, తదితరులు పాల్గొన్నారు.

భక్తిశ్రద్ధలతో నవదుర్గ సామూహిక వ్రతం



కామారెడ్డి అర్బన్: స్థానిక శ్రీశారదామాత ఆదిశంకర ఆలయంలో మంగళవారం శ్రీదత్తపున్నమి సందర్భంగా శ్రీ నవదుర్గ సామూహిక వ్రతం భక్తిశ్రద్ధలతో ఘనంగా నిర్వహించారు. వ్రతంలో పాల్గొన్న భక్తులకు ఆలయ కమిటీ తరఫున పూజా సామగ్రిని సమకూర్చారు. దాతలకు ఆలయ కమిటీ తరఫున అధ్యక్షుడు కే.మహిపాల్‌రెడ్డి సన్మానం చేశారు. అర్చకులు సతీష్ పాండే తదితరులు పాల్గొన్నారు. ప్రసాదాలు అందజేసిన అనంతరం అన్నదానం చేశారు.

'ఉపాధి' పనులపై గ్రామసభ



గ్రామసభలో మాట్లాడుతున్న డీఆర్పీ రాజేశ్వర్

నాగిరెడ్డిపేట(ఎల్లారెడ్డి): జప్తిజాన్కంపల్లిలో జరిగిన ఉపాధిహామీ పనులపై చేపట్టిన సామాజిక తనిఖీకి సంబంధించి మంగళవారం గ్రామసభ నిర్వహించారు. ఈ సందర్భంగా డీఆర్పీ రాజేశ్వర్ మాట్లాడుతూ.. గ్రామంలో గతేడాది ఏప్రిల్ 1 నుంచి ఈ యేడాది మార్చి 31 వరకు ఉపాధి హామీ ద్వారా రూ.13 లక్షల నిధులతో పలు అభివృద్ధి పనులు చేపట్టారన్నారు. 14వ విడత సామాజిక తనిఖీలో భాగంగా వీటిపై మూడు రోజులపాటు గ్రామంలో విచారణ జరిపామన్నారు. అనంతరం విచారణ అంశాలపై గ్రామసభలో చర్చించారు. సర్పంచ్ దేశబోయిన సాయిలు, టెక్నికల్ అసిస్టెంట్ సంతోష్, ఫీల్డ్‌అసిస్టెంట్ రాములు, తదితరులు పాల్గొన్నారు.

అక్షింతల పంపిణీ కార్యక్రమాన్ని విజయవంతం చేయాలి



లింగంపేట(ఎల్లారెడ్డి): అయోధ్యలో రామ మందిర ప్రాణ ప్రతిష్ఠ శుభవేళ రాములవారి పాదాల చెంత పూజ చేసిన అక్షింతల పంపిణీ కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని శ్రీరామ భక్తులు కోరారు. మంగళవారం మండల కేంద్రంలోని వేంకటేశ్వర స్వామి కల్యాణ మండపంలో ఏర్పాటు చేసిన యువజన, కుల సంఘాల సభ్యుల సమావేశంలో భక్తులు మాట్లాడారు. లింగంపేటలో ఈ నెల 30న గడప గడపకు శ్రీరామ అక్షింతలు, స్టిక్కర్, కరపత్రాలు పంపిణీ చేయనున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో శివ్వయ్య, పోశెట్టి, క్రాంతి కుమార్, తదితరులు పాల్గొన్నారు.

రేపటి నుంచి ప్రజాపాలన సదస్సులు

భిక్కనూరు: మండలంలో ఈ నెల 28 నుంచి జనవరి 5 వరకు ప్రజాపాలన సదస్సులు నిర్వహిస్తున్నట్లు మండల పరిషత్ అభివృద్ధి అధికారి అనంత్‌రావు మంగళవారం తెలిపారు. ఈ నెల 28, 29 తేదీల్లో భిక్కనూరు, పెద్దమల్లారెడ్డి, 30న జంగంపల్లి, 30, జనవరి 2 తేదీల్లో తిప్పాపూర్, 2న బస్వాపూర్, మోటాట్‌పల్లి, 3న కాచాపూర్, అయ్యవారిపల్లి, మల్లుపల్లి, కంచర్ల 4న భాగిర్తిపల్లి, ఇసన్నపల్లి, ర్యాగట్లపల్లి, రామేశ్వర్‌పలి, 5న అంతంపల్లి, గుర్జకుంట, లక్ష్మీదేవునిపల్లి, సిద్ధరామేశ్వరనగర్ గ్రామాల్లో సదస్సులు నిర్వహిస్తామన్నారు. ప్రభుత్వం ప్రకటించిన ఆరు గ్యారంటీ పథకాలకు అర్హులు దరఖాస్తు చేసుకోవాలన్నారు.

ఉచిత పశు వైద్య శిబిరం



నస్రుల్లాబాద్(బాన్సువాడ): దుర్కిలో మంగళవారం పశువులకు వచ్చే గర్భ కోశ వ్యాధులకు ఉచిత పశు వైద్య శిబిరం నిర్వహించారు. పశు సంవర్ధక శాఖ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన ఈ శిబిరంలో 16 గర్భ కోశ వ్యాధులకు చికిత్స చేశారు. మందులు అందించారు. కార్యక్రమంలో బాన్సువాడ ఏడీ డాక్టర్ రోహిత్, జేవీవో తుకారాం, సిబ్బంది బాబయ్య, గ్రామస్తులు శ్రీనివాస్, నారాయణ పాల్గొన్నారు.

సభా స్థలం పరిశీలన



పెద్దకొడప్‌గల్(జుక్కల్): జుక్కల్ ఎమ్మెల్యేగా గెలుపొందిన తోట లక్ష్మీకాంతారావు మొదటి సారి మండల కేంద్రంలో పర్యటిస్తున్నారని పార్టీ మండల అధ్యక్షుడు మహేందర్ రెడ్డి తెలిపారు. మండల కేంద్రంలోని పాపనేశ్వర ఆలయంలో ఏర్పాటు చేసే సభ స్థలాన్ని కాంగ్రెస్ నాయకులు పరిశీలించారు. సభను విజయవంతం చేయాలని కార్యకర్తలు, నాయకులను మహేందర్ రెడ్డి కోరారు.

ధర్మపరిరక్షణకు కృషి చేయాలి



మద్నూర్(జుక్కల్): ప్రతి ఒక్కరూ ధర్మ పరిరక్షణకు కృషి చేయాలని తడిహిప్పర్గా పీఠాధిపతి శేషారావు మహరాజ్ అన్నారు. రెండు మూడు రోజులుగా మండలంలోని తడిహిప్పర్గా, లచ్చన్, మద్నూర్, అవాల్‌గావ్‌లో కొనసాగుతున్న దత్త జయంతి ఉత్సవాలు మంగళవారం ముగిశాయి. మండల కేంద్రంలోని మాణిక్‌ప్రభు ఆలయంలో దత్తజయంతి సందర్భంగా ప్రత్యేక పూజలు నిర్వహించారు. వార్కారీలు కీర్తన చేపట్టారు.

సామూహిక సత్యనారాయణ వ్రతాలు

కామారెడ్డి రూరల్: కామారెడ్డి మున్సిపల్ పరిధిలోని దేవునిపల్లి రమాసత్యనారాయణస్వామి ఆలయంలో మంగళవారం పౌర్ణమిని పురస్కరించుకుని సామూహిక సత్యనారాయణ వ్రతాలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆలయ అర్చకుడు శ్రీనివాస్‌రావు ఆధ్వర్యంలో శ్రీ రమాసహిత సత్యనారాయణ కథను భక్తులకు వినిపించారు. అలాగే లింగాపూర్ శివారులోని శ్రీ కోటి లింగేశ్వర అభయాంజనేయస్వామి ఆలయంలో సైతం ఆలయ అర్చకుడు మశ్చేంద్ర ప్రసాద్ ఆధ్వర్యంలో సామూహిక సత్యనారాయణ వ్రతాలు నిర్వహించారు. అలాగే లింగాపూర్ వేంకటేశ్వరస్వామి ఆలయ ఆవరణలో ఆంజనేయస్వామికి చంద్రం పూజలు ఆలయ అర్చకుడు రవికాంత్‌శర్మ ఆధ్వర్యంలో నిర్వహించారు. అనంతరం భక్తులకు ఆలయ కమిటీ ఆధ్వర్యంలో అన్నదానం చేశారు.

కార్యకర్తకు ఎమ్మెల్యే పరామర్శ

భిక్కనూరు: సిద్ధరామేశ్వరనగర్ గ్రామానికి చెందిన బీజేపీ కార్యకర్త సిద్దును కామారెడ్డి ఎమ్మెల్యే కేవీఆర్ మంగళవారం పరామర్శించారు. ఇటీవల రోడ్డు ప్రమాదంలో సిద్దు గాయపడ్డాడు. విషయం తెలుసుకున్న ఎమ్మెల్యే కేవీఆర్, ఆయన ఇంటికి వెళ్లి పరామర్శించి ధైర్యం చెప్పారు. అండగా ఉంటానన్నారు.



తాడ్వాయి శబరిమాత ఆశ్రమంలో కల్యాణ మహోత్సవ కార్యక్రమాన్ని నిర్వహిస్తున్న వేద పండితులు

ప్రారంభమైన శబరి ఆశ్రమ వార్షికోత్సవాలు

- ఇతర రాష్ట్రాల నుంచి భారీ సంఖ్యలో తరలి వచ్చిన భక్తులు
- కిటకిటలాడిన శబరిమాత ఆశ్రమం



గ్రామంలో భిక్ష స్వీకరిస్తున్న భక్తులు

తాడ్వాయి(ఎల్లారెడ్డి): మండల కేంద్రంలో శబరి మాత ఆశ్రమంలో మంగళవారం 53 వార్షిక మహోత్సవ కార్యక్రమాలు ఘనంగా ప్రారంభమయ్యాయి. వివిధ పూజా కార్యక్రమాలను భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. నిజామాబాద్, కామారెడ్డి, అదిలాబాద్, కరీంనగర్, మెదక్, హైద్రాబాద్ జిల్లాల నుంచే కాకుండా మహారాష్ట్ర, కర్నాటక రాష్ట్రాల నుంచి భక్తులు భారీ సంఖ్యలో తరలి వచ్చారు. ఇతర జిల్లా నుంచి 300 మంది భక్తులు కాలినడకన వచ్చారు. కొంత మంది భక్తులు శబరిమాత మాల ధరించారు. ఉదయం ఆశ్రమం నుంచి వందలాది భక్తులు భజనలు చేసుకుంటూ, గ్రామంలో ఊరేగింపు నిర్వహిస్తూ, ఇంటింటికి తిరుగుతూ మధుకరి(భిక్ష) స్వీకరించారు. వేద మంత్రాల మధ్య వెంకటేశ్వర్ల కల్యాణమహోత్సవ కార్యక్రమాన్ని ఘనంగా జరిపించారు. అనంతరం భక్తులు స్వామివారికి కట్నకానుకలు అందజేశారు. వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన మహాత్ములు తమ సందేశాన్ని ఇచ్చారు. సాయంత్రం వేళ దత్తాత్రేయ జయంతి సందర్భంగా డోలారోహణ కార్యక్రమాన్ని నిర్వహించారు. కామారెడ్డి -ఎల్లారెడ్డి ప్రధాన రహదారిపై ఘనంగా రథోత్సవాన్ని నిర్వహించారు. అన్నదానం చేశారు. ఆర్టీసీ అధికారులు కామారెడ్డి బస్ డిపో నుంచి తాడ్వాయి శబరి మాత ఆశ్రమం వరకు ప్రత్యేకంగా బస్సులను నడిపించారు. ఈ సందర్భంగా పోలీసులు బందోబస్తు ఏర్పాటు చేశారు.

అక్షింతల శోభాయాత్ర కరపత్రాల ఆవిష్కరణ



ఎల్లారెడ్డి: ఎల్లారెడ్డిలో అయోధ్య రామ మందిర అక్షింతల శోభాయాత్ర కరపత్రాలను బజరంగ్‌దళ్ సభ్యులు మంగళవారం ఆవిష్కరించారు. పట్టణంలోని ముత్యాల పోచమ్మ ఆలయంలో జరిగిన ప్రత్యేక కార్యక్రమంలో కరపత్రాలను విడుదల చేశారు. ఈ నెల 29న ఎల్లారెడ్డి పట్టణంలోని అంబేడ్కర్ చౌరస్తా నుంచి రామాలయం వరకు అయోధ్యలో పూజిత అక్షింతల శోభాయాత్ర నిర్వహించనున్నట్లు చెప్పారు. కార్యక్రమంలో బజరంగ్‌దళ్ సభ్యులు వినోద్, ప్రశాంత్ గౌడ్, సాయిబాబా, మహేష్, సాయిప్రసాద్ తదితరులున్నారు.

అయోధ్యకు సైకిల్ యాత్ర



పిట్లం(జుక్కల్): కర్ణాటక రాష్ట్రంలోని బీదర్‌కు చెందిన హనుమాన్‌సేనకు చెందిన 11 మంది యువకులు ఈ నెల 25న బీదర్ నుంచి సైకిల్ యాత్రగా అయోధ్యకు బయలుదేరివెళ్లారు. వారు మంగళవారం పిట్లం మండల కేంద్రానికి చేరుకున్నారు. వారికి పిట్లంకు చెందిన దేవేందర్ స్వాగతం పలికి.. పండ్లు, వాటర్ బాటిళ్లను అందజేశారు. హనుమాన్ సేన సభ్యులు మాట్లాడుతూ.. సైకిల్ యాత్రగా 21 రోజులలో అయోధ్యకు చేరుకుంటామన్నారు. అక్కడికి చేరుకొని అయోధ్య మందిరాన్ని సందర్శించి ప్రత్యేక పూజలు నిర్వహిస్తామన్నారు. అనంతరం 5 రోజుల పాటు అక్కడే ఉండి సేవా కార్యక్రమాలు చేస్తామన్నారు. హనుమాన్ సేన సభ్యులు ఉన్నారు.

భక్తి భావాన్ని పెంపొందించుకోవాలి

- ఎమ్మెల్యే కాటిపల్లి వెంకటరమణారెడ్డి



ఎమ్మెల్యేతో దత్తాత్రేయ ఆలయ కమిటీ ప్రతినిధులు

కామారెడ్డి: ప్రతి ఒక్కరూ భక్తిభావాన్ని పెంపొందించుకొని సమాజాభివృద్ధికి తోడ్పడాలని కామారెడ్డి ఎమ్మెల్యే కాటిపల్లి వెంకటరమణారెడ్డి అన్నారు. కామారెడ్డి పట్టణ శివారులోని దేవునిపల్లి గ్రామంలో హోలియదాసరి సంక్షేమ సంఘం ఆధ్వర్యంలో దత్తాత్రేయ స్వామి ఆలయంలో దత్తాత్రేయ జయంతిని మంగళవారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆలయాన్ని కామారెడ్డి ఎమ్మెల్యే దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం దత్తాత్రేయ కమిటీ ఆధ్వర్యంలో ఎమ్మెల్యేకు శాలువాలతో సత్కరించారు. గురుస్వామి మధు, హోలియదాసరి సంక్షేమ సంఘం అధ్యక్షుడు నరేందర్, జిల్లా అధ్యక్షుడు చిన్న పోశయ్య, కౌన్సిలర్ పోలీస్ క్రిష్ణాజీరావు, వీడీసీ ఉపాధ్యక్షుడు బోజన్నగారి రాజు పాటిల్, తదితరులు పాల్గొన్నారు.

జిల్లాలో ఘనంగా దత్త జయంతి

జిల్లాలో దత్త జయంతిని మంగళవారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా పలు దత్తాత్రేయ స్వామి ఆలయాల్లో ప్రత్యేక పూజలు, భజనలు చేశారు. అన్నదానాలు చేసి మొక్కులు తీర్చుకున్నారు. పలుచోట్ల దత్తాత్రేయుడికి డోలారోహణం నిర్వహించారు. – సాక్షి నెట్‌వర్క్



కల్యాణిలో..



తాండూర్‌లో..



ఎల్లారెడ్డిలోని దత్తగిరి ఆశ్రమంలో వేడుకలు



బిచ్కుందలో భజన చేస్తున్న భక్తులు



ఒడ్డేపల్లిలో దత్తాత్రేయునికి దోలారోహణం చేస్తున్న మహిళలు



ఇబ్రహీంపేట్‌లో..